



ఆ రోజు ఇందిరాదేవికి దుర్దినం. పొద్దున్నే లేచి ఎవరిమొహం చూసిందో! ఆనాడు జరిగినటువంటి పరాభవం ఆమెకు తన ఇరవై సంవత్సరాల జీవితంలోనూ ఎన్నడూ జరగలేదు......

కనీసం ఇందిర అట్లా భావించింది. నిజానికి ఆమె నాలుగు సంవత్సరాల క్రితం వరకూ ఊరూపేరూ లేకుండా ఉండింది. టాకీలలో ప్రవేశింతామని ఆమె చేసిన ప్రతి ప్రయత్నానికీ ఒకప్పుడు చుక్కఎదురవుతూఉండింది. అఖరుకు అవకాశం దొరికినప్పుడుకూడా ఏదో చిన్న వేషం ఇచ్చారు. అదృష్టవశాత్తూ ఆ టాకీ పూర్తిఅయినతరవాత దాని గతి ఏమయిందో ఎవరికీ తెలియదు. ఆ తరవాత మళ్లీ పదినెల్లపాటు ఇందిర స్టూడియోల చుట్టూ వృధాగా తిరిగింది. చివరకు ప్రస్తుతం ఆమె పనిచేస్తున్న స్టూడియోలో ఇందిరకు ప్రవేశం దొరికింది. స్టూడియోవారు ఆమెను అభిమానించి మంచి పాత్రలిచ్చి గడిచిన రెండు సంవత్సరాలనించి ఆమెకు అందలం పడుతున్నారు. నెలకు ఆరువందలు జీతం ఇస్తున్నారు. ఆమె పేరుకూడా ఈనాడు దేశమంతటా ఒక మోస్తరుగా తెలిసిపోయింది. ఆమెను పెద్ద పెద్ద తారలతో జతచెయ్యక పోయినప్పటికీ విమర్శకులు ఆమెనుగురించి నూటికీ కోటికీ నాలుగు మంచి ముక్కలు రాస్తూండటం కద్దు.

కాని ఇందిర ఈరోజున తన జీవితాన్ని జ్ఞాపకంచేసుకున్నదంటే అది ఇరవై సంవత్సరాల జీవితంకాదు, గడిచిన రెండు సంవత్సరాల జీవితమే. తన కిష్టంలేని విషయాలు మరిచిపోవటంలో—సంపూర్ణంగా మరిచిపోవటంలో—ఇందిరను మించిన వాళ్లు ప్రపంచంలో ఎవరూ ఉండరు. అందువల్ల ఆమె, తన జీవితంలో తన కీనాడు జరిగిన పరాభవం ఎన్నడూ జరగటం లేదనుకోవటంలో వింత ఏమీ లేదు.

గాయం తగిలినప్పుడు దాన్ని కెలుకుతూఉండటం వివేకమైన పనికాదు. దాని విషయమే ఆలోచించటంకూడా అటువంటిదే అయిన గాయాన్ని కొండంతిగా భావించటం కూడా తెలివి తక్కువ పనే. కాని ఈ సంగతులు ఇందిరకు తెలియవు. నాలుగున్నరకు స్టూడియోనించి బయలు దేరింది లగాయతు ఇప్పటివరకూ పరాభవాన్ని ఆమెను ఒకేవిధంగా దహించేస్తున్నది. మరొక పది పన్నెండు సంవత్సరాల లోపల ఆమంట కించిత్తయినా ఉపశమించే లక్షణాలు ఈ క్షణంవరకూ ఏమీ లేవు.

'టాకీలలో వేషాలు వేయడం మంచిపనే కాని, శీలం దక్కించుకోవటం కష్టం! కబుర్లు చెప్పటానికేం?— డైరెక్టర్లు మొహమాట పెడతారు...' అంటుంది, జితేంద్రియులలో విశ్వాసంలేని మన కథానాయిక— ఇందిర.

ఈ విషయంలో మీ వుద్దేశం?-

ఎందుకుంటై? తనను ఇంత కాలమూ దేవతకింద చూస్తూఉండినవాళ్లందరి ఎదటా తన కింత పరాభవమైనతరవాత! స్టూడియోలో ప్రతి నౌకరూ, కుర్రాడూ తన విషయం చెప్పుకుని ఇంకా నవ్వుతూ ఉండిఉండాలి. తనను ఇంత కాలమూ గొప్పగా చూసినందుకు వాళ్లంతా పశ్చాత్తాపపడుతూ ఉండిఉండాలి. ఇక తాను జీవించివున్నంత కాలమూ తాను కనపడినప్పుడల్లా వాళ్లు లోపల నవ్వుకుంటారు, తననుగురించి అలుసుగా అనుకుంటారు... ఇక మళ్లీ తాను స్టూడియోలో అడుగు పెట్టబోయింది గనకనా—ఆ గంగూలీ వెధవ డైరెక్టరుగా ఉన్నంతవరకూ! బెంగాలీ మొహమూ వాడూనూ! ఇంతవాడు లేడని కలకత్తానించి బోలెడంత ఇచ్చి తెస్తే వాడికి మనుష్యులమీద గౌరవం ఏం ఉంటుంది? వాడు తన ఇష్టంవచ్చినట్టు ప్రవర్తించక ఏం చేస్తాడు? ... ఎంత పొగరు వాడికి! తనకు పదిహేను "టేక్సు" ఇస్తాడా — ఒక్క వాక్యంకోసం! తనకు ప్రేమఅంటే ఏమిటో తెలియదంటాడా? తాను స్టంటు పిక్చర్లలో నాయికా పాత్రకు పనికివస్తుందంటాడా? ... తన కోసం కాలుకాలిన పిల్లులల్లే తిరిగినవాళ్లున్నారని ఆ గంగూలీకి ఏం తెలుసునూ? తనను ఎంతమంది ప్రేమించారో, తన ప్రేమకు ఎటువంటివాళ్లు పాత్రులైనారో తాను చూశాడా?.....వెధవ బెంగాలీ బాబు! వెధవ గంగూలీ!...

కొత్తగా కలకత్తానించి దిగుమతిఅయిన గంగూలీని చూస్తే స్టూడియో ప్రొప్రయిటరు దగ్గిరనించి స్టూడియో వడ్రంగుల వరకూ అపారమైన భక్తిఅనీ, అతనిచేత తప్పు పట్టించుకోవటం తనకు నామోషీ అని ఎవరూ అనుకోరనీ, తాను స్టూడియోలో గంటన్నర వ్యర్థంచేసి మూడు నాలుగువందల అడుగులు ఫిలిం పాడుచేసి డైరెక్టరు కోరినవిధంగా ఒక్క వాక్యం చెప్పలేకపోవటంగురించి అందరూ అప్పుడే మరిచిపోయినారనీ ఇందిరకు తెలియలేదు. అదీ గాక ఇందిర గంగూలీ వచ్చిన కొత్తలో అతని తెలివితేటలను గుర్తించగలిగింది. అంతే దాకా ఎందుకు? ఈ రోజు రెండున్నర వరకూ గంగూలీ అంటే ఆమెకూ భక్తి ఉండింది. కాని ఆ విషయం ఆమె కిప్పుడు జ్ఞాపకంలేదు. ఆమె మరుపునుగురించి ఇంతకుముందే చెప్పాను కాదూ!

"ఈ రోజుకు షూటింగు పూర్తి అయింది" అని డైరెక్టరు అనకపూర్వమే ఇందిర ఇవతలికి వచ్చేసింది. అక్కడినించి ఎవరితోనూ మాట్లాడకుండా నేరుగా తన ఇంటికి, మైలుదూరమూ కాలినడకనే, వచ్చేసింది.

ఇందిరకు ఇంటిదగ్గిర ఒక పావుగంట సేపయినా తోచలేదు. తనకోసం ఎవరైనా వస్తారేమో, ఎవరైనా పిలుస్తారేమో. ఎవరినీ చూసేటందుకుగాని, ఎవరితోనూ మాట్లాడేటందుకుగాని తగిన స్థితిలో లేదు ఆమె మనస్సు. ఎక్కడికైనా వెళ్లాలి—ఎక్కడికైనాసరే, ఎవరూ లేనిచోటికి.

ఇందిర చప్పున లేచి అలవాటు చొప్పున అద్దంలో చూసుకోగానే మొహాన "మేకప్" కనిపించింది. వెంటనే ఆమె బాత్‌రూమ్‌కు వెళ్లి మొహం శుభ్రంగా కడుక్కుని, కొంచెం క్రీమ్

# ★ ఆత్మపరీక్ష ★

వేసుకుని కొద్దిగా పౌడరు తగిలించి, కట్టుకున్న చీర మార్చి, చెవుల లోలాకులు మార్చి, చేతి సంచి పట్టుకుని, వంటకూడా చేసే నౌకరుతో రెండు ముక్కలు మాట్లాడి బయటికివచ్చింది.

"టాక్సీ తీసుకురానా, అమ్మా?" అంటూ నౌకరు వెంటపడ్డాడుకాని ఇందిర వినిపించుకోలేదు. ఆమె వీధిలోకి రాగానే ఖాళీగా వెళుతున్న టాక్సీ ఒకటి ఆమెనుచూసి ప్రశ్నార్థకంగా వేగం తగ్గించింది. ఇది ఒక శకునంగా పరిగ్రహించి ఇందిర టాక్సీని ఆపి అందులో ఎక్కింది.

టాక్సీవాడు ఎక్కడికిపోవాలన్నాడు. "గేట్ వే!" "అని చెప్పింది ఇందిర ఆలోచించకుండా. తీరా టాక్సీ టాజ్ హోటలు పరిసరాలకు చేరినతరవాత అక్కడి జనాన్ని చూడగానే ఇందిరకు చెప్ప శక్యంగాని రోత పుట్టింది. అందరివీ ఎరిగిన మొహాలల్లేనే అనిపించినై. తాను అక్కడికి ఎందుకువచ్చావా అని ఆశ్చర్యపడుతూ, "ఇక్కడ కాదు. కొలాబా బీచ్‌కి పోనీ!" అన్నదామె.

కొలాబా బీచ్‌మీద విశేషం జనం లేరు, అంతా ప్రశాంతంగా ఉన్నది. కాని ఇందిర కళ్లకు ప్రపంచమంతా తన జీవితం మోస్తరుగానే బిక్కుబిక్కుమంటున్నట్టున్నది. తనను తాను మరిచిపోవాలంటే ఒంటరిగా కూర్చోవటంకాదు, జనం మధ్యపడటమే — గేట్ వే దగ్గిర చేరే రకం జనంకాదు.

"చౌపాతీకి పోనీ!" అన్నది ఇందిర. టాక్సీ మళ్లీ కదిలింది. చౌపాతీ జనంతో కిక్కిరిసిఉంది. గేట్ వేదగ్గిర చేరే జనం ఏదోచేస్తున్నట్టూ ఏమో అనందిస్తున్నట్టూ నటిస్తుంది. చౌపాతీలో చేరే జనానికి మరమరాలు తినటంతప్ప చేసేందు కేమీ లేదు. అక్కడకూడా ఆగబుద్ధిపుట్టలేదు ఇందిరకు.

ఆమె చేతిగడియారంలో ఆరున్నర కావస్తున్నది. దగ్గిరలోఉన్న సినిమా ఏదైనా అందుకోవటానికి టైము. తన్ను తాను మరిచిపోవటానికీ లోకాన్ని మరిచిపోవటానికీ అంతకంటె మంచిఉపాయం ఏముంటుందీ ?

"పాథేసినిమాకు పద!" అన్నది ఇందిర టాక్సీవాడితో. టాక్సీ శాండ్‌హర్స్టు రోడ్డులోకి తిరిగి మళ్లీ లామింగ్‌టన్ రోడ్డులోకి తిరిగి కొంతదూరంవెళ్లి కుడివైపుకి జరిగి "పాథే" సినిమాముందు ఆగింది. ఇందిర దానిలోనించి దిగి డబ్బిచ్చి టాక్సీని పంపేసి లోపల ప్రవేశించింది.

## భరతనాట్య భంగిమాలు: ౧.



గోపీనాథ్ — తంగమణి

ఆనాడు "పాథే"లో ఆడుతున్న చిత్రం "ది బ్రైడ్ కమ్స్ హోమ్". అందులో నటించినవాళ్లు క్లాడెట్ కొల్బర్ట్, ఫ్రెడ్‌మాక్‌ముర్రే, రాబర్ట్ యంగ్ వగైరాలు. ఇంతలోకూడా ఇందిరకు అసంతృప్తేఅయింది. ఆమెకు ఫ్రెడ్‌మాక్ ముర్రేనుచూస్తే ఎందుకో పరమఅసహ్యం. మరీ అతని మూతి—

కాని అక్కడపెట్టిఉన్న ఫోటోలవంక చూసేటప్పుడు ఇందిర ఫ్రెడ్డీనితప్ప ఇంకెవర్నీ చూడలేదు. ఆమె వ్యక్తిత్వంలో ఉన్న విశేషమే అది. అతన్నీ అతని మూతినీ చూడటమూ, చూసి అసహ్యించుకోవటమూ పూర్తిచేసి ఇందిర వెనక్కు తిరిగి ఆశ్చర్యంతో అట్లాగే నిలబడిపోయింది ఆమెవెనకే నిలబడి ఆ ఫోటోలవంక చూస్తున్నాడు — ఫ్రెడ్‌మాక్ ముర్రే!

కనీసం ఆ కుర్రవాడెవరో అచ్చగా ఫ్రెడ్ మోస్తరుగానే ఉన్నాడు. అదే జుట్టూ, అదే మూతీనూ ఇందిర కాసేపు తనకళ్లను నమ్మలేకపోయింది. ఆమె అతనివంక తేరిపార చూడసాగింది. అతను దాదాపు ఆరడుగుల ఎత్తున్నాడు. చాలా మితభాషీ, పరుషమైన వాక్కుగలవాడూ అనిపించింది ఇందిరకు. ఆమె సహజంగా అతనికి ఫ్రెడీ తెరమీదప్రదర్శించే గుణాలన్నీ ఆపాదనచేస్తున్నది. కాని ఆమె అనుమానానికి తగినట్టే ప్రవర్తిస్తున్నాడు ఈ కుర్రవాడుకూడా.

మొదటిసంగతి అతను ఆమెను చూసినట్టేలేదు అతని వాలకంచూస్తే. కావాలని అతను తనను చూడనట్టు నటిస్తున్నాడనుకున్నది ఇందిర. తనను చూడటమే కాక గుర్తుపట్టికూడా ఉండాలి. తనను తెరమీద తప్పక చూసిఉంటాడు, తనఫోటో పత్రికల్లో చూసిఉండకపోవటం అసంభవం. మళ్లీ తనవంక చూస్తాడో లేక చూడనట్టుగానే అవతలికి వెళ్లిపోతాడో, ఏం చేస్తాడో చూతామని ఆమె కొంచెం ఎడంగా జరిగి అక్కడే నిలబడింది.

ఆమె కోరిక త్వరలోనే నెరవేరింది. ఆ కుర్రవాడు ఫోటోలుచూడటం పూర్తిచేసి ఆమెవంక చూడకుండానే టిక్కెట్లు కొనుక్కునే చోటికి వెళ్లాడు. ఇందిరకు ఒళ్లు మండిపోయింది. ఆమె అతన్ని వెంబడించింది. అతను తనవైపు మళ్లీచూసి తీరాలి. చూడకపోతే ఆమె ఆత్మకు తృప్తికలిగేటట్టు లేదు. అతను తనకేసి ఎందుకు చూడకపోవాలీ ? తను అంత అసహ్యంగా ఉందా? లేక అతను మనిషి కాడా? జితేంద్రియుడా? అది తేల్చుకునితీరాలనుకుంది ఇందిర. ఆమెకు జితేంద్రియులలో విశ్వాసంలేదు. అదికూడా ఆమె వ్యక్తిత్వంలో ఒక ముఖ్యమైన లక్షణమే.

• అతను రూపాయిబేడా టిక్కెట్టు కొనుక్కుంటున్నాడు. ఇందిర ఎన్నడూ-అంటే ఈ రెండుసంవత్సరాల కాలంలోనూ — రెండురూపాయిల పావలాకు తక్కువ టిక్కెట్టుతో సినిమా చూడలేదు. కాని ఈనాడు సాహసించింది. ఆ కుర్రవాడు టిక్కెట్టుతీసుకునే లోపలే తనకూడా వెళ్లి దాదాపు అతన్ని అనుకుని నిలబడి తనచెయ్యికూడా పెట్టింది.

ఆవిధంగా అతను ఆమెవంక చూడవలసివచ్చింది. కాని ఇందిరకు తృప్తికలగలేదు. అతను తనవంక ఒకసారిచూసినవాడల్లే చూడలేదు మొదటిసారి — జన్మలో మొదటిసారి — చూస్తున్నట్టు చూశాడు. పైగా అతను ఆమెనుచూసి గుర్తుపట్టినట్టు కనిపించలేదు, ఆఖరుకు ఎవరో స్ఫురించినట్టయినా కనిపించలేదు. ఇది చాలనట్టుగా అతను తనవైపుచూసిన చూపు చాలా వాడిగా "ఎందుకంత తొం

# ఆత్మపరీక్ష

దరపడతావు? నాపని అయేదాకా ఆగలేవా?" అన్నట్టున్నది.

ఇందిర టిక్కెట్టుకొనుక్కుని చిల్లర డబ్బులు తీసుకుని అటూ ఇటూ చూసేటప్పటికి ఆ కుర్రవాడెక్కడా కనిపించలేదు. ఆమె గబగబా హాలులోకి వెళ్లి అతను ఒక కుర్చీలవరస మధ్యగా ఒంటరిగా కూర్చుని ఉండటం చూసింది. అతనికి కుడివైపున ఒక కుర్చీ, ఎడమవైపున రెండుకుర్చీలూ ఖాళీగా ఉన్నై. కావాలంటే ఇందిరకు ఇంకా ఇతర ఖాళీకుర్చీలు చాలా ఉన్నై; కాని అతనిపక్కనే కూర్చోవటానికి నిశ్చయించుకున్నదామె. అప్పటికీ అతని ఎడమవైపునఉన్న కుర్చీలలో ఒకదానిలో కూర్చోవచ్చును; ఇందిర అదీ చెయ్యలేదు—అతని మీదుగా వెళ్లి అతని కుడిప్రక్కన ఖాళీగాఉన్న కుర్చీలో కూర్చున్నది. అతను తనవంక టిక్కెట్లుతీసుకొనేచోట చూసినట్టే చూస్తున్నాడని ఊహించి ఆమె గమనించనట్టు నటించింది. ఆమె కుడిపక్కనఉన్న పార్సీపెద్దమనిషి సవినయంగా తనకుర్చీలో సాధ్యమైనంత చిన్నవాడై కూర్చుని దీక్షగా తెరవంక చూస్తూఉండటం కూడా గమనించిందామె. నలభై దాటిన పార్సీ పెద్దమనిషి ఎవరూ ఆమెకు అర్థమయేవాడు కాడు.

సినిమా ప్రారంభమయింది. చిల్లర చిత్రాలన్నీ అయిపోయిన తరవాత అసలు చిత్రం ప్రారంభమయింది. ఫ్రెడీ తెరమీద కనిపించగానే ఇందిరకు విచిత్రమైన వికారంకలిగింది. అతన్నిచూస్తే తనకు అసహ్యంకావచ్చును కాని అతను మరొకవిధంగా ఉంటే తన కిష్టంలేదని ఆమె కనుక్కున్నది. క్లాడెట్ అతన్ని పీడించటం ఇందిరకు నచ్చింది. ఫ్రెడీ వంటి అరణ్యమృగాన్ని పీడించటంలో సరదా లేకపోలేదు. తన కటువంటి అవకాశందొరకలేదు. తను ఎరిగిఉండిన మగవాళ్లంతా తన దగ్గరికి చేతులు చాచివచ్చి తన సాన్నిధ్యంలో జావఅయిపోయినవాళ్లే. ఆ రకం మగవాణ్ణిచూస్తే ఇందిర కిప్పుడు అసహ్యంపుట్టింది...ఫ్రెడీవంటి వాణ్ణి ప్రేమించటంలోకూడా సరదా ఉందా...?



ఇందిరకు ఇవాళ మరొక కొత్త అనుభవంకూడా కలుగుతున్నది. ఇదివరలో ఆమె టాకీలుచూసినప్పుడు మైకూ, కామెరా, క్లాప్ కాలూ మొదలైనవి జ్ఞాపకం రాకుండా చూడగలిగేదికాదు. ఆమెకు వెనక ఎప్పుడో ఎవరో సలహాఇచ్చారు, టాకీలు అట్లా చూడమని. కాని ఈనాడు తన కళ్ళఎదట నిజంగా ఏదో జరుగుతున్నట్టుంది. మూడు సంవత్సరాలనించీ అయిన అలవాటు ఈ రోజున మాయమయింది.

ఇంటర్వెల్లో ఇందిర పక్కన కూర్చున్న కుర్రవాడు లేచి బయటికి వెళ్లాడు. అతనితో ఆమె నోరువిప్పి ఒక్కమాట అయినా మాట్లాడకపోయినప్పటికీ తన పక్కన అతను లేకపోగానే ఆమె ఒంటరిగత్తె అయిపోయినట్టు భావించింది; అతను మళ్లీ రాడేమో, వచ్చి మరొకచోట కూర్చుంటాడేమో అని భయపడసాగింది.

నిజానికి ఆమె మనసులో కలిగిన గాయానికి అతను మందుమాదిరిగా పనిచేశాడు. అతన్ని చూసినక్షణంనించీ ఆమె తన్నుతాను మరిచిపోగలిగింది, తనను సంబంధించని విషయాలనుగురించి ఆలోచించగలిగింది. జరిగిన గంట కాలంలోనూ అతను నిమిషంపాటయినా ఆమె మనసులో లేకుండా పోలేదు. అందుకు తెరమీది ఫ్రెడీ చాలా సహాయంచేశాడు ...అసలు తనపక్క కుర్రవాణ్ణికూడా ఇందిర ఫ్రెడీ అనే తన అంతరాత్మలో సంబోధిస్తున్నది!

అతను మళ్లీ తిరిగివచ్చాడు, యథాస్థానంలో కూర్చున్నాడు. అప్పుడు తెలిసింది ఇందిరకు— అతని రాక వల్ల తన మనసు ఎంత ఆరాటపడిందీ. అతనెవరో సామాన్యుడై ఉండవచ్చును; తాను పేరు ప్రఖ్యాతులు గల తార. ఈ రెండు విషయాలూ ఆమెకు ఆ క్షణంలో తెలియవు.

సినిమా ఆఖరయేసమయానికి ఇందిరకు ఆలోచన వచ్చింది. తనకీ కుర్రవాడు మంచి గీటురాయి. అతన్ని లోబరుచుకోగలిగితే, అతన్ని ఆకర్షించగలిగితే తనకు ప్రేమఅంటే ఏమిటో తెలిసినట్టేనా? ఆత్మపరీక్ష చేసుకోవటానికి ఇంతకంటె మంచి అవకాశం ఎప్పుడు దొరుకుతుంది?

## భరతనాట్య భంగిమాలు: ౨.



గోపీనాథ్

చిత్రం పూర్తికాగానే అతనివెంటనే ఆమె బయటికి నడిచింది. ఆమె తన్ను అనుసరిస్తున్న సంగతి తెలియనట్టే అతను పెద్ద పెద్ద అంగలువేసుకుంటూ ఆమెకు అందకుండా నడిచిపోసాగాడు. ఇందిర ఎవరైనా చూస్తున్నారేమో అని లక్ష్యం కూడా చెయ్యకుండా చిన్న పరుగుతీసి అతన్ని అందుకుని మెల్లగా అతని చెయ్యి తాకి "నేనుకూడా వస్తున్నాను, ఉండండి," అన్నది.

అతను ఆశ్చర్యంతో ఆమెవంక చూసి "ఎక్కడికి?" అన్నాడు.

"మీరెక్కడికి?" అన్నది ఇందిర.

"బోర్ బందర్."

"నా టాక్సీలో మిమ్మల్ని అక్కడ దించి నేను ఇంటికిపోగలను రండి"

"థాంక్స్! నేను ట్రాములో పోతాను."

"వద్దు. టాక్సీలో రండి నాకేమీ శ్రమలేదు."

ఫ్రెడీ తికమకపడితే ఎట్లా ఉంటుందో ఇందిర కొంచెం నమూనా చూసింది. ఎన్నడూ ఎరగని ఆడది తన టాక్సీలో రమ్మంటే ఎవరైనా తికమకపడతారు. కాని ఆ కుర్రవాడు ఒక్కక్షణం ఆలోచించి, "నాకేమీ అర్థంకావటంలేదు. పదండి!" అన్నాడు. ఇందిర కృతజ్ఞతాపూర్వకంగా నవ్వి దారితీసింది. ఆ కుర్రవాడి ప్రాణానికి పాశ్చాత్య జీవితం తల్లక్రిందులైనట్టుగా ఉంది. పర్యవసానం ఒకటే ననుకున్నాడు—తన చెయ్యి కొంతవరకు తడికావటం.

తీరా టాక్సీ బోర్ బందర్లో ఎంపైర్ హోటలు ముందాగి, అతను దిగబోతుండగా ఆమె, "మీరు మాఇంటికి వచ్చెయ్యకూడదూ భోంచేసిపోవచ్చును," అన్నది.

"క్షమించాలి."

"అట్లా అంటే కాదు. మీరు తప్పక రావాలి."

# ఆత్మపరీక్ష

ఆ కుర్రవాడు తెరిచిన తలుపు మళ్లీ మూసి కూర్చున్నాడు. ఇందిర డ్రైవరుకు తన ఇంటి ఎడ్రసు ఇచ్చింది.

ఇందిర దారిపొడుగునా వసపోసిన పిట్టమాదిరిగా వాగసాగింది. ఆమె గొంతులో ఉన్న విజయధ్వని అతనికి అర్థం కాలేదు. ఆమె సంభాషణ అతను పరధ్యానంగా వింటూ అట్లాగే అడిగినదానికి సమాధానాలు చెప్పాడు. తనకు టాకీలలో వేషం వెయ్యాలని ఉంది చాలా కాలంనించీ. ఎవరైనా తీసుకుంటారా? తన అందం చాలుతుందా? కొంతమంది బాగా ఉండి కూడా ఫోటోలో బాగుండరు! అతను ఇంగ్లీషు టాకీలేనా దేశీయమైనవి కూడా చూడటం అలవాటుందా? ఎందువల్లా? తన స్నేహితురాలొకతె టాకీలలో వేషాలు వేస్తుంది. మంచిపనే కాని శీలం దక్కించుకోవటం కష్టం! కబుర్లు చెప్పటానికే? డైరెక్టర్లు మొహమాటపెడతారు — బెంగాలీ డైరెక్టర్లు అయితే తప్ప. వాళ్లు పట్టి స్తబ్ధులు. బెంగాలీ వాళ్లను బొంబాయిలో అడుగు పెట్టనివ్వకూడదు. కలకత్తాలో బొంబాయి డైరెక్టర్లెవరున్నారు గనక?...

టాక్సీ ఇందిర సహాయంతో ఆమె ఇంటి దగ్గిర ఆగింది. ఇద్దరూ దిగారు. "ఇక్కడే మా స్నేహితురాలు ఉండేది!" అంటూ ఇందిర లోపలికి దారితీసింది. • • •

"ఇందిర వచ్చిందా?" అని అడిగిందామె నౌకర్ను.

వాడు ఆశ్చర్యం పైకి కనిపించనీకుండా "అమ్మా?" అన్నాడు.

"ముందు మా కిద్దరికీ భోజనం పెట్టు!"

"చిత్తం."

ఇద్దరూ భోంచేశారు.

"ఇక నేను సెలవు తీసుకుంటాను," అన్నాడతను.

"కాస్సేపు కూర్చుండి. మా స్నేహితురాలు సినిమాకు వెళ్లిందేమో. మనని పన్నెండింటివరకూ పలకరించేవాళ్లుండరు. నా కింకా నిద్ర రావటం లేదు. ఒంటరిగా కూర్చోవాలి"

"రాత్రి పన్నెండింటికి నేను హోటలుకు ఎట్లా పోగలను?"

ఇందిర నవ్వి—"పోలేకపోతే ఇక్కడే పడుకుందురు గాని. అభ్యంతరమా?"

అతను మాట్లాడలేదు. అయిదు నిమిషాలు గడిచింది. ఈ అయిదు నిమిషాలలోనూ అతను ఆమెవంక చూడలేదు, ఏమీ మాట్లాడలేదు, ఏమీ చెయ్యలేదు. అతనికి ఆడవాళ్లంటే భయమా? అయితే ఇంతదూరం వస్తాడా? ఎప్పుడో తప్పించుకునేవాడు. తనలో నిజంగా ఆకర్షణ లేదా? అదివరకు తనచేత ఆకర్షించబడ్డ వాళ్ల మాటేమిటి? తనకు వచ్చిన ప్రణయలేఖలు? తను నిరాకరిస్తే ఏడిచినవాళ్లు? రాయిమాదిరిగా కూర్చున్న అతన్ని చూస్తున్నకొద్దీ ఇందిరకు మండిపోసాగింది. ఆఖరుకు సాహసంచేసి, కోపంవచ్చి జుట్టు పీక్కున్న సామెతగా ప్రవర్తించింది ఇందిర.

ఆమె లేచివెళ్లి లైటార్పేసి వచ్చి అతను కూర్చున్న సోఫామీద అతని పక్కనే కూర్చుని అతని మెడచుట్టూ చెయ్యివేసింది.

"నేను మొదటినించీ అనుకుంటూనే ఉన్నాను!" అన్నాడతను.

"అభ్యంతరమా?" అన్నది ఇందిర తన మొహం అతని మొహానికి చేర్చి.

"ఏమీ లేదు!" అంటూ అతను బలమైన చేతులతో ఆమెను ఎత్తి తన ఒళ్లో కూర్చోబెట్టుకున్నాడు. ఇందిర జయించాననుకున్నది. కాని ఆ భావాన్ని తోసేస్తూ మరొక భావంకూడా ఆమె మనస్సులో పైకివస్తూ ఉండింది. దాన్ని ఇందిర ఆ క్షణంలో అర్థంచేసుకోలేదు.

ఆ భావం ఆఖరుకు పైకివచ్చింది— అతన్ని తను జయించలేదు, తనే అతనికి ఓడిపోయింది ఇందిర. అతని స్పర్శకు తన రక్తం అల్లకల్లోలమయింది, తన హృదయం దడదడలాడింది. అతనిలో ఈషణ్మాత్రమైనా సంచలనం కలిగి ఉంటుందా? భగవంతుడు అతని హృదయంలో పెట్టిన మంచురాయి కొంచెమైనా ద్రవించి ఉంటుందా? ఇందిర నమ్మలేకపోయింది.

వెనకటి యుగాల్లో మునీశ్వరుల తపస్సును భంగపరిచిన అప్సరసలు ఇందిరకంటె స్థూలబుద్ధులై ఉండాలి, లేదా మనిషిని పరీక్షించటంలో అప్పటికీ, ఇప్పటికీ తేడా ఉండి ఉండాలి. వెనకటి అప్సరసల లెక్కప్రకారం ఈ యువకుడు ఓడిపోయినాడు. అతని శరీరం ఇందిర వశమయింది. కాని ఇందిరకు అతన్ని జయించిన తృప్తి కలగక పోవటానికి బదులు తను ఓడిపోయినట్టు కూడా రూఢిఅయింది. ఆమె ఆత్మపరీక్ష పూర్తిఅయింది. ఈ కుర్రవాడు తన రక్తాన్ని మథించినట్టు అదివరకెన్నడూ ఎవరూ కలతపెట్టి ఉండలేదు.

మళ్లీ దీపపు వెలుతుర్ని చూస్తే అతను ఎప్పటిమాదిరిగానే ఉన్నాడు. ఇంత శ్రమపడి ఇందిర అతన్ని ఒక్క అంగుళం సమీపించలేకపోయింది!

"ఒక్కటి చెప్పు. ఏం కోరిచేశావీపని?" అన్నాడతను జేబులో చెయ్యి పెట్టి.

"నేనేమీ కోరలేదు," అన్నది ఇందిర పిల్లిమాదిరిగా అయిపోయి. అతని కళ్లవంక చూడటమైనా ఆమెకు చాతకాలేదు.

"నేను నమ్మలేకుండా ఉన్నాను."

"నేను మిమ్మల్ని ప్రేమించి ఉండకూడదు?"

"ప్రేమకాదని తెలుసును. కనక నే అడుగుతున్నాను. డబ్బా?"

ఇందిరను శూలంపెట్టి పొడిచినట్టయింది. ఆమె ఆబాధ పైకి కనిపించనీయకుండా "కాదు. మిమ్మల్ని నేను ప్రేమించలేదని ఎట్లా తెలుసును?" అన్నది.

"ప్రేమించిన మనిషికి ఇంద్రియనిగ్రహం ఉంటుందేమో అనుకుంటాను. నన్ను ఒకరిద్దరు అదివరలో ప్రేమించారు. వాళ్లిట్లా ప్రవర్తించలేదు. నేను ప్రేమించినప్పుడుకూడా నా ప్రేమను ఇంత ఆవేశంతో ఖర్చుచేసుకోలేదు. నా అనుభవంలో ప్రేమించిన మనిషికి సాధ్యమైనంత ఎడంగా ఉండటంలో ఆనందం ఎక్కువ ఉంది."

"ప్రేమించినందుకు గుర్తు ఒకరి మొహం ఒకరు చూసుకోకపోవటమా?"

## భరతనాట్య భంగిమాలు: 3.



తంగమణి

# ఆత్మపరీక్ష

"ప్రేమించిన మనిషికి ఇంద్రియనిగ్రహం ఉంటుం దేమో అనుకుంటాను. నన్ను ఒకరిద్దరు ప్రేమించారు. వారిట్లా ప్రవర్తించలేదు. నేను ప్రేమించినప్పుడు కూడా నా ప్రేమను ఇంత ఆవేశంతో ఖర్చుచేసుకోలేదు. నా అనుభవంలో ప్రేమించిన మనిషికి సాధ్యమైనంత ఎడంగా ఉండటంలోనే ఆనందం ఎక్కువ ఉంది."

"నేనా మాట అనలేదు — సాధ్యమైనంత తక్కువ చూసుకోవటం. ప్రేమించినవాళ్లకది సాధ్యమవుతుందనుకుంటాను. చేతికి చిక్కిన సౌఖ్యాన్ని చేతి కందినట్టుగా పొందటం ప్రేమించిన వాళ్ల లక్షణంకాదు మొత్తానికి. ప్రేమికులు పరమలోభులు. వాళ్లు అతి స్వల్ప విషయాలనించి అమిత ఆనందం పొందుతారు. కాంక్షకంటె ప్రేమ కృత్రిమమైనదికాదా? సహజమైన కాంక్షే సరి అయిన మనుష్యులలో పడితే చక్కని ప్రేమ అవుతుందేమో ననుకుంటున్నాను. అయినా నేను ప్రేమ విషయంలో అల్ప సంతోషినికాను. నా అభిప్రాయాలు నీకు పనికిరాకపోవచ్చును."

అల్పసంతోషి — తనూ! తను కాంక్ష తప్ప మరేమీ ఎరగదు. అంతేకాక తను ఏ మగవాణ్ణీ ప్రేమించే స్థితికి రానివ్వలేదు. తనను తను చౌకచేసుకుంది. ఇంద్రియనిగ్రహంలో తనకెన్నడూ విశ్వాసం లేకపోయింది. అందుచేతనే నేమో తనకు ప్రేమ సంగతి తెలియకపోవటం... ఆ కుర్రవాడు చెప్పినమాటలు సంశయించాలని ఇందిరకు తట్టలేదు.

అతను వెళ్లిపోవటానికి ఉద్యుక్తుడయినాడు. ఆమె అతన్ని పోవద్దనలేదు. అతను ఆమెను సమీపించి రెండు చేతులతోనూ ఆమె మొహంపట్టుకుని కళ్లలోకి చూస్తూ "నాకు కృతజ్ఞత లేదనుకోకు. భగవంతుడు నీ కింత అందమైన మొహం ఇచ్చాడు. ఈ మొహంలో ప్రేమ కనిపిస్తే ఎట్లా ఉంటుందో చూడగలిగితే చాలా సంతోషించేవాణ్ణి!" అన్నాడు.

అతను వెళ్లిపోయినతరవాత దీపం ఆర్పేసి ఇందిర పక్కమీద అస్పష్టమైన ఆలోచనలు చేస్తూ పడుకుంది. త్వరలోనే ఆమెకు నిద్రపట్టింది. మర్నాడు ఉదయం లేవగానే ఆమె మనస్సు చాలా తేలికగానూ ఉల్లాసంగానూ ఉంది. ఆమె అర్థంచేసుకోలేకపోయింది. మళ్లీ ఆ కుర్రవాడు జ్ఞాపకంవచ్చాడు. అతని హోటలుకు ఫోను చేతామనిపించింది. ఇందిర రిసీవరు తీసికూడా మళ్లీ పెట్టేసింది. అతని మాటలు జ్ఞాపకం వచ్చినై.

ఆమె ఆనాడు షూటింగుకు పోలేదు. వంట్లో సరిగాలేదని స్టూడియోకు ఫోను చేసింది. రోజులు గడిచినై. ఇందిర పాత స్నేహితులను రానివ్వటం అప్పట్లో ఆపుదలచేసింది. ఆమెను చూసినవాళ్లంతా "ఏమిటి విశేషం?" అని అడగసాగారు. స్టూడియోలో గంగూలీకూడా రెండు మూడు సార్లు అమాటే అన్నాడు.

ఇందిరకు అప్పుడప్పుడూ వెర్రికోరిక కలిగేది, ఆ కుర్రవాణ్ణి మళ్లీ చూడాలనీ అతనితో మాట్లాడాలనీ. పూర్వం ఎప్పుడూ ఆమె మగవాణ్ణి కేవలమూ చూడటానికిగాని మగవాడిగొంతు వినటానికిగాని అంత ఆరాటపడి ఎరగదు. కాని ఆ కుర్రవాడిమాటలు వేదవాక్యాలుగా తీసుకుని ఆమె నిగ్రహం అభ్యసిస్తున్నది.

ఈ విధంగా నెలరోజులు గడిచింది. ఒకనాడు స్టూడియోనించి ఇందిరను ఒక స్నేహితుడు తన కారులో తెచ్చి ఇంటి దగ్గిర దించి తనుకూడా దిగాడు. ఆరాత్రి అతను ఇందిరను మొహమోటపెట్టి అక్కడే ఉండిపోయినాడు. ఈ విధంగా ఇందిర తనలో కలిగిన మార్పును స్పష్టంగా తెలుసుకోగలిగింది. మర్నాడు ఉదయం ఆ స్నేహితుడు వెళ్లిపోయిన తరవాత ఆమెకు చాలా హాయిగా ఉంది. ఆ మనిషిని మళ్లీ చూడకుండా ఉంటే బాగుండుననుకున్నది.

కాని ఇందిర ఆమాటమీద ఉండలేకపోయింది. ఆమె కింకా ఇతర స్నేహితులున్నారు. త్వరలోనే ఆమె జీవితం మళ్లీ యథాప్రకారం అయిపోయింది. ఇప్పటికీ వెనకటికీ తేడా ఏమంటే — ఇప్పుడామెకు వెనక ఎరగని అసంతృప్తి ఒకటి కలిగింది. ఆ అసంతృప్తి పైకివచ్చినప్పుడల్లా ఆ కుర్రవాడి హోటలుకు ఫోనుచెయ్యాలనిపించేది. అతని రూము నంబరుమాత్రమే తెలుసును ఇందిరకు. ఆమె తన పూర్వస్నేహితులతో చిరాకు పడటమూ పోట్లాడటమూ సాగించింది.

ఒకనాడామెకు ఏమీతోచలేదు. ఆరోజున ఆమె కొక కొత్తసందేహం కలిగింది. ఆమె ఆ కుర్రవాణ్ణి క్రమంగా మరిచిపోతున్నది! అది ఆమె కిష్టంలేదు. తన జీవితానికి ఒక్కరినన్నా ప్రేమించాలి — ప్రేమించితీరాలి. తనకు అతని మీద ప్రేమ లేదేమో! అంటే అతన్ని క్రమంగా మరిచిపోవటం ఎందుకు కలుగుతుందీ? ఈ దిక్కుమాలిన ఇంద్రియనిగ్రహం తను ఏమని ప్రారంభించిందీ? ఆకుర్రవాడు తనను మోసంచేశాడు. తను అతన్ని ఈ నెలా పదిహేను రోజుల్లోనూ చాలాసార్లు చూసి ఉండవలసింది. అతన్ని తను నిజంగా ప్రేమించింది.


అసలు రహస్యమేమంటే ఆ కుర్రవాడు ఇందిరతో "నీ కళ్లలో నేను ప్రేమ చూడగలిగాను!" అని అంటే విని సంతోషించాలని ఇందిరకు.

ఆ సాయంకాలం ఇందిర టాక్సీ వేసుకుని "పాథే సినిమా"కు వెళ్లింది. ఆ కుర్రవాడు ప్రమాదవశాన మళ్లీ కనిపిస్తాడేమోనని ఆమె అంతరాత్మలో ఆశ. కాని ఆ ఆశ ఆమెకే తెలియదు — హాలు దగ్గిర పెట్టిన ఫోటోలలో ఫ్రెడ్ మాక్ ముర్రేను చూసేవరకూ. అప్పుడామె కర్థమయింది తను అక్కడికి ఎందుకు వచ్చిందీ, ఆ ఫోటోల కెదురుగా ఎందుకు నిలబడిందీ. ఆ కుర్రవాణ్ణి స్వయంగా వెళ్లి చూడటానికి ఆమెకు ధైర్యంలేదు. "ఇది ప్రేమకాదు!" అని అతను అంటే?

ఇందిర జారిపోయిన హృదయంతో రూపాయి బేడా టిక్కెట్టు కొనుక్కుని లోపలికి వెళ్లి కూర్చుంది. ఆ కుర్రవాడు రాలేదు. అందరి మొహాలూ పరికించింది ఇందిర. అతని మొహం కనిపించలేదు.

ఆనాడు ఆ హాలులో వేస్తున్న చిత్రం "ట్రెయిల్ ఆఫ్ ది లోన్సమ్ పైన్." వర్ణచిత్రం. ఫ్రెడ్ మాక్ముర్రేను చూడగానే ఇందిరకు అసహ్యం వేసింది. అతని మొహం ఎర్రగా ఉంది. అతన్ని సిల్వియా సిడ్నీ ఏమని ప్రేమించిందో కథ చూస్తున్న ఇందిరకు అర్థంకాలేదు.

ఇంటర్వల్ లో ఇందిర బయటికివచ్చేసింది. ఆమె మళ్లీ హాలులోకి పోలేదు. నేరుగా టాక్సీచేయించుకుని ఎంపైర్ హోటలుకు వచ్చేసింది. ఆమెను చూడగానే లిఫ్ట్ వాడు తలుపుతెరిచాడు. ఆమె 25 నంబరు గది వెతుక్కుంటూ వెళ్లి చూసింది. అందులో ఇద్దరాడవాళ్లు తప్ప ఎవరూలేరు.



హే కుమారస్వామి యానవాహ్యములార! హే మంత్రదేవతా స్వాములార!
హే కాలవిజ్ఞాన పాతకోవిదులార! హే భూతభుక్తి కుంభార్హులార!
హే యహల్యా జారయతివహేతువులార! హే బలాత్కార కామాంధులార!
హే నిరంకుశ వహాహంకారనిధులార! హే కామవిజయ కాహళములార!
హే ఖగేంద్రంబులార! కయ్యమున నల్గిపోవుచున్నారె దేవతాభువనమునకు!
మీరు రంభాతిలోత్తమా మేనకాది భోగకార్యార్థమై కోడిపుంజులార!

— వినుకొండ వల్లభరాయుడు.